క్లుప్తంగా

జన చైతన్య యాత్రకు.. ఖమ్మం వలంటీర్లు


యాత్రకు బయలుదేరిన వలంటీర్లు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం ఆధ్వర్యాన వరంగల్ నుంచి శుక్రవారం ప్రారంభమైన జన చైతన్య యాత్రకు ఖమ్మం నుంచి వలంటీర్లు తరలివెళ్లారు. నగరంలో వలంటీర్ల బైక్ ర్యాలీని పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.ప్రకాష్, యూత్ జిల్లా నాయకులు సీహెచ్. రమేష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: బీజేపీ మతోన్మాద కార్పొరేట్ విధానాలను వ్యతిరేకిస్తూ మార్చి 17 నుంచి 29 వరకు చేపడుతున్న సీపీఎం జన చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం మండల నాయకుడు బింగి రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని బచ్చోడులో యాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, సనాతనాచారి, నర్సయ్య పాల్గొన్నారు.

రేపు హౌస్ బిల్డింగ్ కో ఆపరేటివ్ సమావేశం

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదులాపురంలోని ఈ–బ్లాక్ కాలనీలో గల సొసైటీ ఫంక్షన్ హాల్ ఆవరణలో నిర్వహించే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించబడుతుందని, సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

మాజీ ఉపసర్పంచ్ మృతి


రామయ్య(ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడు మాజీ ఉప సర్పంచ్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు పుసులూరి రామయ్య(72) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పార్టీ జిల్లా నాయకుడు గోకినపల్లి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి కమ్మకోమటి నాగేశ్వరరావు, నాయకులు పుసులూరి పుల్లయ్య, గిరిప్రసాద్, శివలింగం, సైదులు తదితరులు రామయ్య మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా వ్యాప్తంగా ఇటీవల ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన 10వ తరగతి టాలెంట్ టెస్ట్‌లో న్యూవిజన్ పాఠశాలకు చెందిన కె.మధుర హాసిని మొదటి స్థానంలో నిలిచిందని సంఘ జిల్లా అధ్యక్షుడు టి.ప్రవీణ్ తెలిపారు. అలాగే త్రివేణి పాఠశాల విద్యార్థిని పి.మణిచంద్ర సాయి, శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి జోష్ణవ్‌కుమార్, న్యూవిజన్ పాఠశాల విద్యార్థి ఎ.లలనిక చౌదరి, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థి రాఘవేంద్ర నవనీత్ నవందర్‌లు తొలి ఐదు స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు.

సర్పంచ్ 'రాయల'కు నివాళి

తిరుమలాయపాలెం: ఇటీవల మృతిచెందిన పిండిప్రోలు గ్రామ సర్పంచ్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ నాయకుడు రాయల నాగేశ్వరరావుకు పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ శుక్రవారం పిండిప్రోలులో నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ మండల కార్యదర్శి జి.రమేష్ బ్రహ్మాచారి, శ్రీను, పట్టాభి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సార్
వినోద	బలగం
సాయిరాం	పలానా అబ్బాయి, పలానా అమ్మాయి
ఆదిత్య	కబ్జా
శ్రీనివాస	షాజాం
సుందర్	సింహా

– ఖమ్మంవ్యవసాయం

అడుగంటిన 'గంగాదేవి'!

పైప్‌లైన్ లీకులతో నిలిచిన ఎత్తిపోతల పథకం

- నీరందక ఎండిపోతున్న చెరువు
- 350 ఎకరాలకు అందని సాగునీరు
- పంటలు ఎదిగే సమయాన వేధిస్తున్న నీళ్ల కొరత
- ఆందోళన చెందుతున్న రైతాంగం


చెరువుకు నీరందించే ఎత్తిపోతల పథకం


ఎండిపోయిన గంగాదేవి చెరువు

కూసుమంచి: ఓ పక్క పాలేరు నియోజకవర్గంలో భక్త రామదాసు ప్రాజెక్టు నీటితో చెరువులు నీటితో కళకళలాడుతుంటే.. కూసుమంచిలోని గంగాదేవి చెరువు (ఊర చెరువు)కు మాత్రం నీళ్ల లేక అడుగంటిపోయింది. మార్చిలోనే ఈ చెరువు అడుగంటడంతో చెరువుపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతాంగానికి నీళ్లందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి పొలాలు పొట్టదశలో ఉండగా.. నీటి తడులు లేక ఎండిపోయే పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు కింద 350 ఎకరాల్లో రైతులు వరి, మిర్చి, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేస్తున్నారు. కూసుమంచి రైతాంగానికే కాగా సమీపంలోని తురకగూడెం, కిష్టాపురం రైతులకు కూడా ఈ చెరువు నీటిని వినియోగిస్తున్నారు. వేసవిలో వందలాది పశువులు తాగునీటి కోసం ఈ చెరువు వద్దకు వస్తుంటాయి.

ఎత్తిపోతల పథకమే శరణ్యం..

కూసుమంచిలోని గంగాదేవి చెరువుకు పాలేరు రిజర్వాయర్ నుంచి సాగర్ జలాలు అందించేందుకు నానుతండా వద్ద నిర్మించిన నర్సింహులగూడెం–2 ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని సరఫరా చేయనున్నారు. కాగా, నీటిని సరఫరా చేసే పైపులకు లీకేజీలు ఏర్పడటంతో తగినంత నీరు చెరువుకు చేరటం లేదు. ప్రస్తుతం భక్తరామదాసు నీరు గంగాదేవి చెరువుకు చేరే అవకాశాలున్నా.. నారాయణకుంట, శనగకుంట నిండితేనే ఈ చెరువుకు నీరు వస్తుంది. ప్రస్తుతం ఆ అవకాశం లేకపోవటంతో చెరువుకు ఎత్తిపోతల పథకమే శరణ్యమైంది. ఈ పథకం ద్వారానే చెరువుకు నీరు చేరే అవకాశం ఉంది.

పంటలను కాపాడాలి..



గంగాదేవి చెరువును సాగర్ నీటితో నింపి పంటలను కాపాడాలి. చుట్టుపక్కల అన్ని గ్రామాల్లోని చెరువులు నీటితో కళకళలాడుతుంటే మా చెరువు ఎండిపోయింది. వరి పొలాలు పొట్టదశలో ఉన్నాయి. వాటికి తడులు అందితేనే పంట చేతికొస్తుంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని పంటలను కాపాడాలి.

– బారి వీరభద్రం, రైతు, కూసుమంచి

లీకులు సరిచేస్తున్నాం..



గంగాదేవి చెరువుకు నీటిని అందించే నర్సింహులగూడెం ఎత్తిపోతల పథకం పైప్‌లైన్‌కు లీకులు ఏర్పడటంతో మోటార్లు నిలిపివేశాం. ప్రస్తుతం లీకులు సరిచేయిస్తున్నాం. రెండు, మూడు రోజుల్లో మోటార్లు ఆన్‌చేసి నీటిని సరఫరా చేస్తాం. ఈ పథకం నిర్వహణ రైతులే కాబట్టి వారు సహకరించాలి.

– రమేష్‌రెడ్డి, డీఈఈ, జలవనరులశాఖ

ప్రశ్నించే గొంతుకను నొక్కడమే మోదీ అజెండా..


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

ఖమ్మంమయూరిసెంటర్: మతోన్మాద బీజేపీతో పెను ప్రమాదం పొంచి ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో సిద్దినేని కర్ణకుమార్ అధ్యక్షతన నిర్వహించిన సీపీఐ ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మతం, కులం పేరిట విభజన తీసుకుని రావడమే గాక దేశ సంపదను అంబానీ, అదానీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. సీబీఐ, ఈడీ లాంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థలను మోదీ బీజేపీ అనుబంధ సంస్థలుగా మార్చారని, ఎన్నికల సంఘాన్ని, న్యాయ వ్యవస్థను తన గుప్పెట్లో పెట్టుకునేందుకు బీజేపీ యత్నిస్తుందన్నారు. ప్రశ్నించే గొంతుకను నొక్కడమే మోదీ అజెండా అని, దేశం నుంచి బీజేపీని పారదోలితే తప్ప దేశ ప్రజాస్వామ్యానికి మనుగడ లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యువత జీవితంతో చెలగాటమాడుతున్నాయని, ప్రశ్నా పత్రాల లీకేజీకి సంబంధించి దోషులను కఠినంగా శిక్షించడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ బలాన్ని ప్రతిబింబించే రీతిలో కార్యాచరణ చేపడతామన్నారు. ఏప్రిల్ 14 నుంచి దేశ్‌కి బచావో– బీజేపీ హఠావో అనే కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా పాల్గొన్నారు.

భట్టి పాదయాత్రలో కార్పొరేటర్లు


భట్టితో కార్పొరేటర్లు, నాయకులు

ఖమ్మంఅర్బన్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్రలో ఖమ్మం కార్పొరేటర్లతో పాటు రఘునాథపాలెం మండల నాయకులు పలువురు పాల్గొంటున్నారు. ఈమేరకు శుక్రవారం యాత్రకు ఖమ్మం 2, 8వ డివిజన్ల కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, నాయకుడు భూక్యా బాలాజీనాయక్ తదితరులు హాజరయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఖమ్మం మామిళ్లగూడెం: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ ఆధ్వర్యాన శుక్రవారం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఎదుట ధర్నా నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బుర్ర ఉపేంద్రసాహూ మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగానే గ్రూప్–1 రద్దు అయినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల బలిదానాలతో గద్దెనెక్కిన కేసీఆర్ విద్యార్థుల ఆత్మహత్యలను పట్టించుకోవటంలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు శ్రీనివాస్‌గౌడ్, ఉపేందర్, చంద్రమోహన్, విజయ్, మహిళా కన్వీనర్లు మంజుల, రజిని, రమేష్, నాగేశ్వరావు, బాలరాజు, పూలే, మల్సూరు, రామయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

నీరుగారుతున్న నిరుద్యోగుల ఆశలు

ఖమ్మంమయూరిసెంటర్: టీఎస్‌పీఎస్‌సీ బోర్డ్ ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష చేయకుండా.. లక్షల మంది అభ్యర్థుల సమస్యలపై ప్రస్తావించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుతో నిరుద్యోగుల ఆశలు నీరుగారుతున్నాయన్నారు. టీఎస్‌పీఎస్‌సీ బోర్డును తక్షణమే ప్రక్షాళన చేయాలని, ప్రభుత్వం లీకేజీ వ్యవహారంపై కఠినంగా వ్యవహరించి నిరుద్యోగులపై ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని డిమాండ్ చేశారు.

సామూహిక కుంకుమ పూజలు


కుంకమ పూజలు చేస్తున్న భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ మధురానగర్‌లోని శ్రీశ్రీశ్రీ భువనేశ్వరీమాత, శ్రీశ్రీశ్రీ రాధాకృష్ణదేవతాసహిత, శ్రీశ్రీశ్రీసమర్థ సద్గురు సాయినాథ దేవాలయం నాల్గో వార్షికోత్సవ సందర్భంగా శుక్రవారం సాయినాథునికి మహా పుష్పాభిషేకం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఉపాధ్యక్షుడు వల్లభనేని శ్రీనివాసరావులు, కమిటీ ఆధ్వర్యాన అన్నదానం చేయించారు.

బాలుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రఘునాథపాలెం: మండలంలోని పుఠానీతండాలో కుక్కకాటుతో మృతి చెందిన బానోతు భరత్ కుటుంబానికి పువ్వాడ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. ఈమేరకు రూ.5 వేల నగదు అందజేసిన బీఆర్ఎస్ నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కాగా, బాలుడి కుటుంబానికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దివ్యాంగుడైన భరత్ తండ్రి రవీందర్‌కు చికిత్స చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆత్మ కమిటీ చైర్మన్ భూక్యా లక్ష్మణ్‌నాయక్, మార్కెట్ వైస్ చైర్మన్ అఫ్జల్, బీఆర్ఎస్‌మండల అధ్యక్షుడు మాలోత్ వీరునాయక్, సర్పంచ్ భూక్యా బుజ్జితో పాటు నాయకులు రవికిరణ్, జాటోతు సూర్యనాయక్, భూక్యా బాలాజీ, బానోతు బాలాజీ, బానోతు కోక్యా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బంది కలగనివ్వొద్దు

ఖమ్మంమయూరిసెంటర్: ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఇబ్బందులు లేకుండా రవాణా సౌకర్యం కల్పించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మస్తాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సంఘ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల నుంచి మండల కేంద్రాలు, జిల్లా కేంద్రానికి పరీక్ష రాసేందుకు వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రవాణ సౌకర్యంతో పాటు పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు ఆర్‌కే చలపతి, ఓం, ప్రభు, అజయ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

'యాదవ బంధు' వర్తింపజేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో దళిత బంధు పథకంలాగే గొల్ల కురుమలు, యాదవులకు యాదవ బంధు వర్తింపజేయాలని యాదవ సంఘం జిల్లా నాయకుడు జాల నరసింహారావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని టూటౌన్ ఏరియాలో నిర్వహించిన యాదవ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదవ బంధు కింద పాల వ్యాపారం, టెంట్ హౌజ్, ఇతర షాపులకు కేటాయించాలని, అలాగే పల్లెల్లో యాదవులకు గొర్రెలు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. యాదవులను చిన్న చూపు చూస్తే ప్రభుత్వాలు పడిపోక తప్పదన్నారు. ఈ సమావేశంలో నాయకులు జాల శ్రీను, పుల్లయ్య, తోడేటి రమేష్, మాదుగుల పెద్ద వెంకటేశ్వర్లు, దొడ్డ శ్రీను, అనసూర్య, టి.మణి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నర్సింహారావు

పువ్వాడతోనే ఖమ్మం అభివృద్ధి..

మేయర్ పునుకొల్లు నీరజ


సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వచ్చిన తర్వాతే ఖమ్మం నలుదిశలా అభివృద్ధి చెందిందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నగరంలో రోడ్ల నిర్మాణం, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, నూతన మున్సిపల్ కార్యాలయ భవనం, ఐటీ హబ్, కొత్త బస్టాండ్ నిర్మాణాలన్నీ 2014 తర్వాత జరిగినవేనని తెలిపారు. పొంగులేటి వెంట ఉండే ఒకరిద్దరు కార్పొరేటర్లు మాట్లాడినంత మాత్రాన అభివృద్ధి జరగనట్లు కాదని పేర్కొన్నారు. త్రీటౌన్ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రకాశ్‌నగర్ వద్ద మున్నేరులో చెక్‌డ్యాంమ్ నిర్మించిన ఘనత మంత్రి పువ్వాడకే దక్కుతుందన్నారు. ఖమ్మంలో జరిగిన అభివృద్ధి కనిపించకపోతే కంటివెలుగులో పరీక్షలు చేయించుకొని కళ్లజోళ్లు తీసుకొని ధరించి చూడాలని హితవు పలికారు. నగరంలో 2,500 ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తే 27వ డివిజన్‌లోనే 300 పట్టాలు పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు.మంత్రిని విమర్శించే అర్హత ఎవరికీ లేదన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఫాతిమ జోహర, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ దోరేపల్లి శ్వేత, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, మక్బూల్, రోజ్‌లీనా తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ..

ఫోర్జరీ సంతకాలపై విచారణ జరపాలి...


వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంరూరల్: రూరల్ మండలంలోని ల్యాండ్ కన్వర్షన్ లేకుండా నిర్మించిన ఇళ్ల లేఅవుట్ ప్లాట్ల విషయంలో ఫోర్జరీ సంతకాలు చేసిన ఘటనపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని బీజేపీ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం శుక్రవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ వీఆర్ఓ నుంచి ఐఏఎస్ వరకు సంతకాలన్నీ ఫోర్జరీ చేసి వందల ఎకరాలను కన్వర్షన్లు చేసి ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నట్లు ఆరోపించారు. ఈ దందాపై విచారణ చేసి మరలా ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి నకిరికంటి వీరభద్రం, దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు కోటమర్తి సుదర్శన్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్లమాస శ్రీను, వేమున వేణు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నుంచి కాపాడాలి...

నేలకొండపల్లి: వీధి కుక్కల నుంచి ప్రజలను కాపాడాలని బీజేపీ మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు సయ్యద్ మోహినుద్దీన్ బోదులబండ పంచాయతీ కార్యదర్శికి శుక్రవారం వినతి పత్రం అందించారు. అనంతరం మోహినుద్దీన్ మాట్లాడుతూ.. వీధి కుక్కలు పాఠశాలకు వెళ్తున్న చిన్నారులను పరుగులు పెట్టిస్తున్నాయని, పిల్లలను బడికి పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారని ఆరోపించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ధర్నాచౌక్ వెడల్పు పెంచాలి...

ఖమ్మం సహకారనగర్: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న ధర్నా చౌక్ వెడల్పును పెంచాలని ప్రజాపంథా నాయకులు కలెక్టరేట్ ఏఓ కారుమంచి శ్రీనివాసరావుకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం ప్రజాపంథా ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఆవుల అశోక్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేస్తున్న ధర్నాచౌక్ 200 మందికి మాత్రమే సరిపోయేలా ఉందని కనీసం వెయ్యి మందికి కూర్చునేలా పెంచి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. నగరంలో పాత కలెక్టరేట్ ఎదుట ఉన్న ధర్నా చౌక్‌లో యథావిధిగా కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి.ఝాన్సీ, చందు, శ్రీను, సత్తార్ పాల్గొన్నారు.

అధ్యాపకులకు శిక్షణ

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల్లో వ్యవస్థాపక నైపుణ్యాలను పెంపొందించేలా బోధించేందుకు గాను అధ్యాపకులకు శిక్షణ ఏర్పాటుచేశారు. ఈమేరకు రెండు రోజుల పాటు కొనసాగనున్న శిక్షణ ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం మొదలైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ భారతీయ యువశక్తి ట్రస్ట్, జిల్లా పారిశ్రామిక అభివృద్ధి సంస్థల ద్వారా అధ్యాపకులను శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాధిక మీనాక్షి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్ తదితరులు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

'సర్వజ్ఞ' విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న డైరెక్టర్ నాగేంద్రకుమార్

ఖమ్మం సహకారనగర్: హైదరాబాద్‌లో మహిళా దినోత్సవం, ఉగాది పండుగను పురస్కరించుకొని భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన ఈ నెల 8వ తేదీన నిర్వహించిన వేడుకల్లో తమ విద్యార్థిని కె.లక్షణ్య నృత్య ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, సీలిమలు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో విద్యార్థిని అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. తమ విద్యార్థులు చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో సైతం ముందుంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ'లో ఇంటర్న్‌షిప్ పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కళాశాల చైర్మన్ జి.కృష్ణ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల ఆధ్వర్యాన ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించే స్వేచ్ఛ తెలంగాణ అగ్రిటెక్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమ వాల్‌పోస్టర్లను శుక్రవారం కళాశాలలో చైర్మన్ గుండాల కృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పైథాన్, పాండాస్, అజైల్ మెథడాలజీ, ఆరెంజ్ ఎంఎల్, ఓపెన్ సీవీ, అపాచి సూపర్ సెట్ తదితర కోర్సుల ద్వారా వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులను వినియోగించేలా శిక్షణనివ్వనున్నట్లు తెలిపారు. అదే విధంగా రైతులు పండించిన పంటల సాగు, అమ్మకం వంటి సమాచారం కోసం యాప్‌ను రూపొందించి విద్యార్థులకు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమీ డైరెక్టర్లు శివప్రసాద్, సుభాష్‌చందర్, రవీంద్రబాబు, ఎస్.శ్రీనివాసరావు, స్వేచ్ఛ టీఎస్ ఇంటర్న్‌షిప్ మెంబర్లు శివ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వర్షార్పణం..

మండలాల్లో శుక్రవారం తెల్లవారు జామున కురిసిన అకాల వర్షానికి పలు గ్రామాల్లో కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసిపోయింది. మొక్కజొన్న తోట నేలవాలింది. ఒకరోజు ముందు నుంచే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుని కొంతమేర పంటను కాపాడుకోగలిగారు. రోడ్లు జలమయమయ్యాయి. కాగా, దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు, పార్టీ నాయకులు పరిశీలించారు. – సాక్షి నెట్‌వర్క్


రఘునాథపాలెం: బావోజీతండాలో తడిచిన మిర్చిని పట్టాలపై ఆరపెడుతున్న రైతులు


కూసుమంచి: నర్సింహులగూడెంలో మిర్చి రాశి చుట్టూ చేరిన వర్షం నీరు


కూసుమంచి: హట్యాతండాలో అండర్‌పాస్‌లో నిలిచిన వర్షం నీరు


ఖమ్మంరూరల్: గుదిమళ్లలో నేలవాలిన మొక్కజొన్న


నేలకొండపల్లి: అప్పలనరసింహాపురంలో మొక్కజొన్న తోటను పరిశీలిస్తున్న ఏఓ అరుణ